## అన్నదాన భవన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఈఓ



కాణిపాకం, అక్టోబర్ 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలు జరుగు తున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన అన్నదాన భవన్ నిర్మాణ పనులను దేవస్థానం ఈఓ పట్టెం గురు ప్రసాద్ శనివారం పరిశీలించారు. రద్దీ రోజు రోజుకు పెరుగుతుండడంతో దేవస్థానం భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమంను విస్తరిస్తోంది. ప్రస్తుతం వున్న అన్నదాన భవన్ చాలకపోవడంతో సామూహిక కళ్యాణ మండపాన్ని నూతన అన్నదాన భవన్‌గా మార్పు చేస్తు న్నారు. ఈపనులను ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ పరిశీలించారు. ఈపనులకు సంభందించి ఈఈ వెంకట నారాయణ ఈఓ గురుప్రసాద్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఏఈ శివాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## పిడుగు పడి ఇల్లు ధ్వంసం

### ఎలక్ట్రికల్ పరికరాలు ధ్వంసం .. 3 లక్షల ఆస్తి నష్టం

బాలాయపల్లి, అక్టోబర్ 19, ప్రభాతవార్త మండలంలోని గొట్టికాడు గ్రామంకు చెందిన మద్దూరు సుబ్ర మణ్యం ఇంటిపై పిడుగు పడింది. ఇల్లు పాక్షికంగా ధ్వంసమై ఇంటిపై పిడుగుపడింది. ఇల్లు పాక్షిక్షంగా ధ్వంస మైన ఇంటిలోని వస్తువులు కాలిపోయాయి. శనివారం ఉదయం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి గొట్టి కాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఇంటి పై పిడుగు పడడంతో ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిడ్జ్, ఏసి, వాషింగ్ మిషన్ వంటి విద్యుత్ పరికరాలన్నీ కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.3లక్షలు వరకు నష్టం వాటిల్లిందని, ప్రాణ నష్టం జరగలేదని కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



## స్విమ్స్‌లో పారిశుధ్య నిర్వహణ భేష్

### కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి
### జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ ఎం వెంకటేశన్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

స్విమ్స్ లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉందని సఫాయి కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ పేర్కొన్నారు. శనివారం స్విమ్స్ హాస్పిటల్‌ను శనివారం జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ స్విమ్స్ ను సందర్శించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్, జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్‌కి స్వాగతం పలికారు. అనంతరం స్విమ్స్ లో సఫాయి కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్‌పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చర్ గ్యాలరీ 1లో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషన్ చైర్మన్, స్విమ్స్ అధికారులు, సఫాయి కార్మికులు, కరంచారీ సంఘం నాయకులతో సమావేశమై సపాయి కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇఎస్ఐ,పిఎఫ్ కార్డులు ఇచ్చారా జీతాలు సక్రమంగా ఇస్తున్నారా తదితర విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వృత్తిపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. తమకు ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేవని వారు పేర్కొన్నారు. అధికారుల నుండి తమకు ఎలాంటి ఒత్తిళ్లు ఇబ్బందులు లేవని చెప్పారు. స్విమ్స్ కార్మికుల సంక్షేమానికి చేపడు తున్న చర్యల పట్ల కమిషన్ చైర్మన్ వెంకటేశన్ సంతృప్తి వ్యక్తం చేసి మరిన్ని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఏదైనా కార్మికులకు సమస్యలు ఉన్న యెడల తన కార్యాలయానికి 011 - 2468924 ద్వారా సంప్రదించాలని సూచించారు. అంతకు ముందు రుయా ఆసుపత్రిలో అధికారుల సఫాయి కార్మికులు, కార్మిక సంఘం నాయకులతో చైర్మన్ వెంకటేశన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, టిటిడి శ్రీలక్ష్మి శ్రీనివాసా మ్యాన్ పవర్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీ రామ్ కుమార్, టిటిడి సివిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలాజీ, స్విమ్స్ జనరల్ మేనేజర్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ వి. రాజశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సఫాయి కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మన ఎమ్మెల్యేల గ్రాఫ్ ఇంతేనా!



ప్రభాతవార్త-తిరుపతి:

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం "మంచి ప్రభుత్వం"అంటూ 125రోజుల సంబరాలు జరుపుకుంటున్న సమయంలో తిరుపతి,చిత్తూరుజిల్లాల్లో కూటమి పార్టీల ఎమ్మెల్యేల పనితీరు ఏదనే చర్చ మొదలైంది. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చినపుడు చూపిన చొరవ గెలిచిన తరువాత కనీసం నియోజకవర్గాల్లో జనానికి అందుబాటులో లేకపోతున్నారనే విమర్శలు ప్రజల్లో మొదలైంది. అసలు ప్రజల సమస్యలు వినిపించుకోవడం, తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడానికి కూడా అందుబాటులో లేకపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోనే ఏ ఎమ్మెల్యేగానీ, మంత్రులు గానీ చేపట్టని విధంగా చిత్తూరు జిల్లాలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చేపట్టిన "డయల్ యువర్ ఎమ్మెల్యే"కార్యక్రమంతో కొంతవరకు జనం సమస్యలు తెలుసుకుని, అధికారయంత్రాంగంతో కలసి వాటి పరిష్కారానికి చొరవచూపడం వినూత్నంగా అభినందనీయంగా మారింది. ఆ తరహాలో అటు తిరుపతిజిల్లాలోగానీ, ఇటుచిత్తూరుజిల్లాలోగానీ మరే ఏ ఎమ్మెల్యే కూడా వినూత్న ఈ విభిన్న కార్యక్రమం ఆచరణ చేయకపోవడం మరీ చర్చనీయాంశమైంది. ఓ వైపు ప్రజలకు ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని, నియోజకవర్గంలో ప్రతి గ్రామం, కాలనీ, వార్డుల్లో ఇంటింటికెళ్ళాలని, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని స్వయంగా సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్ సూచిస్తున్నా ఆచరణలో పెట్టలేకపోతున్నారనేది టిడిపి శ్రేణుల్లోనే వినిపిస్తున్న వ్యతిరేకత. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వ తీరుతో విసిగి పోయిన ఉభయజిల్లాల వాసులు టిడిపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటేసి మార్పుతీసుకువచ్చారు. చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరు, చిత్తూరు, జిడినెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో అధికార టిడిపి ఎమ్మెల్యేలే ఉన్నారు. కుప్పం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆ నియోకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ సిఎం ప్రతినిధిగా చాలావరకు ప్రజలకు అవదుబాటులో ఉన్నారనేది జనంలో చర్చఉంది. అడపాదడపా స్వయంగా సిఎం మూడునాలుగురోజులు పర్యటన, ఆయన సతీమణి నారాభువనేశ్వరి ప్రజలకు అవసరమైన అభివృద్ధిని చేపట్టడం జరుగుతుందని పార్టీ వర్గాల వ్యాఖ్యలు. ఇక పలమనేరు నియోకవర్గంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాలనలో పట్టుఉన్న నాయకుడు. సీనియర్ కూడా. మంత్రిగా సేవలందించిన అనుభవం ఉంది. ఇప్పటికీ నియోజకవర్గంలో ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, కొత్త పరిశ్రమలుతీసుకురావడంపై దృష్టి పెట్టలేదనేది జనంలో వినిపిస్తున్న వ్యాఖ్యలు. చిత్తూరు ఎమ్మెల్యే జనంకు అందుబాటులో ఉండి కొంతవరకు అవసరమైన పనులు చక్కబెడుతున్నాడని నియోజకవర్గ ప్రజల మనోగతం. ఇక జిడి నెల్లూరు, పూతలపట్టు,నగరి ఎమ్మెల్యేలు రాజకీయంగా యువకులే. ప్రజలకు అందుబాటులో ఉన్నామని తెలియజేసేలా మెలగుతున్నా పూర్తిస్థాయిలో జనంలో పట్టుసాధించలేకపోతున్నారనే వాదన లేకపోలేదు. కనీస సమస్యలపై అవగాహన కల్గించుకోలేకపోతున్నారనేది జనంలో చర్చ. ఇక తిరుపతిజిల్లాలో తిరుపతి నుండి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రాతినిథ్యం వహిస్తున్నా తిరుపతివాసులకు చెప్పుకోదగిన సమస్యలు పరిష్కారంచేయడంలో చొరవచూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నెలలో మొదటి తారీఖు ఫెన్షన్ల పంపిణీ సమయంలో జనంలో కనిపించి ఆ తరువాత జనం కష్టాల్లో ఉన్నా పలకరింపు కరువైందనేది నగరప్రజల్లో వ్యాఖ్యలు. మొన్న కురిసిన భారీ వరదలకు ఆయన ఉనికి కూడా లేకపోయిందనేది ప్రజల్లో అసహనం. టిడిపి శ్రేణులతో కూడా అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వైసిపి నేతలకు సముచిత ప్రాధాన్య తనిస్తున్నాడనే ఆరోపణలు జనసేననేతల్లో వినిపిస్తోంది. ఇక చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ కూడా జనం సమస్యలు వినిపించుకుని, పరిష్కరించడంపై మరింత పట్టుకలిగించుకోవాలని వ్యాఖ్యలు.

## పాకాల ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్





పాకాల, అక్టోబర్ 19, ప్రభాతవార్త పాకాల మండలం పాకాల పోలీస్ స్టేషన్‌లో పాకాల ఎస్ఐ మహేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వర్‌లను విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఒక రోడ్డు ప్రమాదం కేసు నమోదు చేయకుండా అలసత్వం ప్రదర్శించి, ముద్దాయి పేరును తారుమారు చేసినట్లు ఎస్పీకి ఫిర్యాదు రావడంతో, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా నిజం అని తేలడంతో చర్యలు తీసుకున్నామని అన్నారు. బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వర్తిస్తూ చట్టాన్ని దుర్వినియోగం చేసినట్లు విచారణలో వెల్లడైంది.

## పక్కాగా దళిత ఉద్యోగుల హక్కులు

### జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటు కమిటీ సభ్యులు, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, అక్టోబర్ 19 ప్రభాతవార్త: దళిత ఉద్యోగుల హక్కులు కాలరాయొద్దని ప్రభుత్వం సంస్థలకు జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటు కమిటీ సభ్యులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యంగపరంగా, శాసన పరంగా కల్పించిన హక్కులు, ప్రత్యేక రక్షణ తదితర అంశాలు, ఉద్యోగుల విషయంలో ప్రభుత్వ సంస్థలు ఎలా నడుచుకోవాలో అనే అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే కేరళ రాష్ట్రం మున్నార్, తమిళనాడు రాష్ట్రం కొచ్చి ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించిన కమిటీ శనివారం కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో సదస్సు నిర్వహించింది. జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సారథ్యంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో కర్నాటక రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ షాలినీరాజ్‌నిష్‌తో కలిసి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు. దళిత ఉద్యోగుల సంక్షేమంను దృష్టిలో వుంచుకుని నిర్వహించిన ఈ సదస్సులో దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన హెచ్ఓడిలు, కెనరా బ్యాంకు ప్రతినిధులు, బిఇఎల్, హెఎఎల్, బెంగళూరుకు చెందిన ఐఐఎస్‌సి వంటి ప్రభుత్వ సంస్థలకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటు కమిటీ సభ్యుడి హోదాలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు దళిత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖముఖీ కార్యక్రమంలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమకు సంబంధించిన పలు సమస్యలను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అభ్యున్నతే ధ్యేయంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ పని చేస్తోందన్నారు.

## కృష్ణ తేజ కాలేజ్ విద్యార్థిపై హత్యాయత్నం

### మద్యం మత్తులో కత్తులతో కళాశాలకు చొరబడి దాడి
### బెంబేలెత్తిన విద్యార్థులు






తిరుపతి విద్య,అక్టోబర్ 19,ప్రభాతవార్త:

కృష్ణ తేజ విద్యాసంస్థల్లో భాగమైన కృష్ణ తేజ డిగ్రీ కళాశాల నందు కళాశాల విద్యార్థి పై కొందరు మద్యం మత్తులో కత్తులతో దాడులుకి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.కృష్ణ తేజ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి కృష్ణ తేజ మీడియాతో మాట్లాడుతూ కళాశాల లోపల క్యాంటీన్ లో తోటఇ విద్యార్థులతో చిన్నపాటి ఘర్షణ జరిగిందన్నారు.లెక్చరర్లు జోక్యం చేసుకొని ఘర్షణను సద్దుమణిగిచినట్లు తెలిపారు.అయితే కోపం కసి పంఎచుకున్న విద్యార్థి కొందరు రౌడీ మూకలను మద్యం పోయించి కత్తులతో కాలేజీలోకి ప్రవేశించారన్నారు.కత్తులుతో నన్ను పొడవాలని చూసినప్పుడు సెక్యూరిటీ భయానికి గురైనట్లు పేర్కొన్నారు.నా పక్కన ఉన్న విద్యార్థులను కాపాడమని కోరిన భయంతో గజగజ వణికి పోయారని తెలిపారు.చేసేదేమి లేక పారిపోతుండగా తనను కత్తితో బలంగా తల పై గుద్ది కత్తితో పొడవడానికి ప్రయత్నించారన్నారు.గట్టిగా అరవడంతో కళాశాలలోని లెక్చరర్ల రావడంతో నన్ను వదిలి కత్తితో పొడిచి చంపేస్తామంటూ బెదిరించి అక్కడి నుండి వెళ్లిపోయినట్లు గాయపడిన విద్యార్థి తెలిపారు.గాయాలతో తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నాడు.

**విద్యార్థులకు భద్రత లేని కృష్ణ తేజ కళాశాల**

తిరుపతిలో చదివిస్తే తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు బాగా ఉంటుందని ఆశించిన విద్యార్థులు, తల్లి దండ్రులు జిల్లాలు నుండే కాక పక్క జిల్లాలు,రాష్ట్రాల నుండి కూడా కృష్ణ తేజ కాలేజీలో అడ్మిషన్లను తీసుకొని కళాశాల యాజమాన్యంను నమ్మి పిల్లలను చేర్పిస్తున్నారు.అయితే కళాశాలలోకి ఎవరు వస్తున్నారు?ఎవరు పోతున్నారు?అనేది కనీసం తనిఖీలు లేకుండా ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ నిర్వహిస్తున్నారు.కళాశాలలోకి అసాంఘిక శక్తులు,రౌడీలు,దొంగలు చొరబడిన సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోరు.. యజమాన్యం కూడా విద్యార్థుల భద్రతను పట్టించుకోకపోవడం విచారకరం.

## ఆర్‌టిసి ప్రైవేటు బస్సులు ఢీ

### ముగ్గురికి గాయాలు: బస్సులు ధ్వంసం





శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలోని పుష్పిత్ స్టీల్స్ భారీ పరిశ్రమ సమీపంలో శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.నెల్లూరు నుంచి తిరుపతి వెళుతున్న ఆర్‌కె ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నెల్లూరు నుంచి తిరుపతి నుంచి నెల్లూరు వెళుతున్న ఆర్‌టిసి బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏర్పేడు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తికి సమీపంలోని పుష్పిత్ భారీ పరిశ్రమ వద్ద కొత్త రోడ్డులో టోల్‌గేట్ పనులు జరుగుతున్నాయి.దాంతో ఇక్కడ ఒకే వైపు వదలి పెడుతున్నారు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శారద,తన్మై, ఆర్‌టిసి డ్రైవర్ కుమార్‌కు గాయాలయ్యాయి. కాగా ఆర్‌కె బస్సు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి.

## పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

జిల్లాలోని మున్సిపాలిటీలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అలాగే మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జేసి శుభం బన్సల్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య తదితర మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పనిచేసి నీటి శుద్ధి ప్లాంట్‌లు డంపింగ్ యార్డులు, సంపద కేంద్రాలు తదితర వాటికి భూ సంబంధిత పెండింగ్ అంశాలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని పెండింగ్ ఉన్నవి తమ దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డ్రై వేస్ట్, వెట్ వేస్ట్ సక్రమంగా అమలు కావాలని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బయో మిథనాల్ ప్లాంట్, సిఅండ్‌డి వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ జాగ్రత్తగా అప్రమత్తంగా నిర్వహణ ఉండాలన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ తూకివాకం, ఎస్టీపి ఫైటోరిడ్ టెక్నాలజీ ప్లాంట్ తదితరాలు అమలు తదితర అంశాలపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వివరించారు. వెంకటగిరి ఈఎల్ఎస్ఆర్ నిర్మాణానికి సంబంధించిన భూ సమస్య పరిష్కారమైందని కమిషనర్ తెలిపారు. పుత్తూరులో రెండు ఎస్టీపిలు, ఒక నేచురల్ సుయెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, వెంకటగిరి సూళ్లూరుపేట డంపింగ్ యార్డ్ అంశంపై శ్రీకాళహస్తి ఎన్టిపి నిర్మాణానికి సంబంధించిన అంశాలను సంబంధించిన రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జేసి పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా దిశగా ప్రతి మున్సిపాలిటీ పనితీరు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, నాయుడుపేట కమిషనర్ షేక్ ఫజురుల్లా, గూడూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో కుండపోత

### గంటలో మూడు పదున్ల వాన: భయభ్రాంతులైన జనం

### జలమయమైన వీధులు: విద్యుత్ సరఫరాకు అంతరాయం



వర్షానికి జలమయమైన వీధులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 19 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో శనివారం వేకువ జామున హఠాత్తుగా ప్రకృతిలో మార్పు. ఉరుములు, మెరుపులు జనం ఊహించని రీతిలో ఒక్క గంటలో మూడు పదున్ల వాన. విద్యుత్ సరఫరాకు అంతరాయం, పట్టణంలోని వీధులన్నీ జలమయమయం. అంతంత మాత్రంగా ఉన్న మున్సిపల్ మురుగునీటి కాలువలు పొంగి పొర్లయాయి. ఎం జరుగుతుందో అర్థకాని పరిస్థితి చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి ఆకాశం ప్రశాంతం. పున్నమి పండువెన్నెలతో కళ కళ లాడింది.శనివారం వేకువ జాము నాలుగు గంటల వరకు సాధరణ పరిస్థితి. సుమారు 4.30 గంటల నుంచి విపత్కర పరిస్థితి అన్నట్లు మారింది. ఉరుములు, మెరుపులుతో దడ దడ పుట్టించింది. పట్టణంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరాలో అంతరాయం. కుండపోత వర్షం. ఏం జరుగుతుందో జనానికి అర్థం కాని పరిస్థితి చోటు చేసుకుంది. వేకువ జామున పనులకు వెళ్ళటానికి లేచిన వారికి వర్షం సాగిస్తున్న బీభత్సం ప్రత్యక్షంగా చూసారు.సుమారు గంటకు పైగా వర్షం బీభత్సం సాగింది.

**ఉప్పొంగిన మురుగునీటి కాలువలు:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పురాతన కాలం నాటి మురుగునీటి కాలువలు నేటి అవసరాలను తీర్చలేకున్నాయి. శనివారం వేకుడ జాము ఒక గంట పాటు కుండపోత వర్షంతో పెద్దమసీదు వద్ద మోకాలిలోతు నీళ్ళు నిలబడింది. అంతేకాక జయరామారావువీధి నీట మునిగింది. ఇక సంతమైదానం,మంగళవీధి,శ్రీరామనగర్ కాలనీ, పిచ్చాటూరు రోడ్డులు జలమయం అయ్యాయి.పెద్దమసీదు వీధిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు తెలియక నీటిలో దిగి ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. నెల రోజుల సాధారణ సగటు వర్షపాతం 229 మీమిలు కాగా అన్ని చోట్లా అధికంగానే నమోదయ్యాయి. రెవెన్యూశాఖ అధికారికంగా ప్రకటించిన మేరకు అత్యధికంగా తొట్టంబేడు మండలంలో ఒక్కగంటలో 79 మి.మీలు, శ్రీకాళహస్తిలో 68.9 మి.మీలు బుచ్చినాయుడు కండ్రిగలో 72.4 మి.మీలు, ఏర్పేడులో 34.2 మిమీల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం వరకు వర్షపాత వివరాలు పరిశీలిస్తే శ్రీకాళహస్తిలో 280.7 తొట్టంబేడులో 283.5 బుచ్చినాయుడు కండ్రిగలో 347 మి.మీలు, ఏర్పేడులో 373 మి.మీల వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో ఎలాంటి ప్రాణఆస్తినష్టం జరగలేదని ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వివరించారు.




## తడలో మళ్లీ జోరు వాన

### - కొన్నిచోట్ల వరినాట్లు

తడ, అక్టోబర్ 19 ప్రభాతవార్త

తడ మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మళ్లీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ వర్షంతో కొన్నిచోట్ల పంట పొలాలకు దండిగా నీళ్ల చేరాయి. దీనితో వరినాట్లు కూడా మొదలుపెట్టారు. శనివారం మధ్యాహ్నం కూడా తడలో భారీ వర్షం కురిసింది.

**ఎక్స్‌ప్రెస్ హైవే పనులను అడ్డుకోవద్దు**
- జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి

**తిరుచ్చి వాహనంపై దేవేరులతో కల్యాణ వెంకన్న**

**కేదార గౌరీ వ్రతాన్ని మహిళల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి!**

4 లో

## స్వేచ్ఛ కోసం నడక

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

స్వేచ్ఛ కోసం నడక అనే కార్యక్రమంను గ్రేడ్స్ స్వచ్ఛంధ సంస్థ శనివారం చేపట్టింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బస్టాండ్ వరకు రహదారిపై విద్యార్థులకు ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపల్ వందన త్రిపాఠి మాట్లాడుతూ వాక్ ఫర్ ఫ్రీడం అనే నినాదంతో స్వచ్ఛంద సేవ నిర్వాహకులు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. బానిసత్వం లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెట్టిచాకిరి నిర్మూలన, బలవంతపు వివాహాలు, మహిళలు, బాలబాలికల అక్రమ రవాణాఅంశాలపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని చెప్పారు. గ్రేడ్స్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు శేషాద్రి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రెడ్డిరేఖ, జయశ్రీ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పాలసముద్రం, అక్టోబర్ 19 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆముదాల పంచాయతీ కావేరిరాజపురం అంగన్‌వాడీ కేంద్రంను శనివారం జిడినెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వినీతశ్రీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ వినీతశ్రీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు మెనూ ప్రకారం ఇస్తున్నారా! లేదా! అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు సరఫరా చేసే పౌష్టికాహారంను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ కుమారి పాల్గొన్నారు.

## పనులు వేగవంతం

– పంచాయతీరాజ్ ఎస్‌ఇ శంకర్‌నారాయణ ఆదేశం

పాలసముద్రం, అక్టోబర్ 19 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలంలో నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసి త్వరితంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఇ శంకర్‌నారాయణ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్‌ఇ శంకర్‌నారాయణ శనివారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనంను నవంబర్ 25 నాటికి పూర్తి చేసి ప్రారంభంకు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి సంబంధించి చేపట్టాల్సిన పనులను నాణ్యంగా చేపట్టేలా ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఏఇఇ ఆనందరెడ్డి, ఎంపిడిఓ విద్యావతి, ఎఇ జయరాజ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి నుండి జరిమానా వసూలు

చిత్తూరు, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 14 మంది నుండి ఒకొక్కరికి రూ.10 వేలు, మద్యం సేవించి రెండవ సారి పట్టుబడటంతో అతని నుండి రూ.15 వేలు జరిమానా వసూలు చేశారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు శుక్రవారం పట్టుబడిన వారి నుండి ట్రాఫిక్ పోలీసులు మొత్తం 1.45 లక్షల రూపాయలు చేశారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు సిబ్బందితో కలిసి శుక్రవారం నగర పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించగా ఈ సమయంలో 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. అలాగే ఒక వ్యక్తి రెండవ సారి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు శనివారం వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి ఎదుట హాజరు పరచగా ఆమె మొదటి సారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడి ఒకొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధించగా, రెండవ సారి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి 15 వేల రూపాయలు జరిమానా విధించారు.

## సచివాలయాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటుకు చర్యలు

కుప్పం, అక్టోబర్ 19 ప్రభాతవార్త



కుప్పం మండల పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఓ సాయిలహరి తెలిపారు. పంచాయతీకి సంబంధించిన నిధులతో సిసిటివి కెమెరాలు, వెబ్‌కామ్, వైఫై సౌకర్యం కల్పించాలని కార్యదర్శులకు ఆదేశించినట్లు చెప్పారు. సచివాలయాల పరిధిలో చోరీలు, లైంగిక వేధింపులు తదితరాలు అరికట్టేందుకు గాను ఈ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సచివాలయాల్లో సిసి టివి కెమెరా వ్యవస్థను అందుబాటులో తీసుకువస్తామన్నారు.

## 2030 నాటికి రేబిస్ వ్యాధి నిర్మూలనకు మద్దతు

– పిఇఎస్ వైద్యకళాశాల డీన్ డా॥ కృష్ణారావు

కుప్పం, అక్టోబర్ 19 ప్రభాతవార్త



2030నాటికి రేబిస్ వ్యాధి నిర్మూలన అనే గ్లోబల్ లక్ష్యానికి తాము మద్దతు పలుకుతున్నట్లు పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం పిఇఎస్‌లో పిజి విద్యార్థులకు జంతువుల కాట్లు మరియు విషప్రయోగం, మానవులు, జంతువులు, మరియు పర్యావరణ పరస్పర సంబంధం అనే అంశంపై జోనల్ స్థాయి సదస్సు నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ డా॥ చిత్ర నాగరాజ్, బెంగళూరు కిమ్స్ యాంటీ రేబిస్ క్లినిక్ ప్రొఫెసర్ డా॥ గిరియన్న గౌడ, కృష్ణగిరి టిసిఆర్ ఆస్పత్రి టాక్సికాలజిస్ట్ డా॥ సౌ ందర్ రాజ్, కోలారు రీజనల్ రీసెర్చ్ అధికారి డా॥ నటరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా జంతువులు, పాము కాట్లు, జూనోటిక్ వ్యాధులు, ఎమర్జింగ్ వన్ హెల్త్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాంతంలోని సుమారు రెండు వందల మంది కమ్యూనిటీ మెడిసిన్, స్పెషలిస్ట్ కోర్సులు చదువుతున్నపిజి విద్యార్థులు హాజరయ్యారు.

## స్వర్ణకారులచే సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కుప్పంరూరల్, అక్టోబర్ 19 ప్రభాతవార్త



స్వర్ణకారులకోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం తో శనివారం కుప్పం పట్టణంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, నారాయణాచారిల అధ్వర్యం లో సిఎం చంద్రబాబు నాయుడు, డి.సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలా భిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వర్ణకా రుల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. స్వర్ణకారుల కార్పోరేషన్ ద్వారా పేద స్వర్ణకారుల కుటుంబాలు ఆర్థికంగా కోలుకుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నాగరత్నం, నేతలు శంకరాచారి, శివకుమార్, వెంకటరమణ, చలపతి, స్వర్ణకారులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 31మంది ఎంపిక

కుప్పంరూరల్, అక్టోబర్ 19 ప్రభాతవార్త



కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి వారిచే శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వంద మంది శిబిరంకు హాజరు కాగా వారిలో 31 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ప్రజలకు తమిళరసన్ కుటుంబీకులు భోజన వసతి సమకూర్చారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు డా॥ మహేష్, లయన్స్‌క్లబ్అధ్యక్షుడుసోమశేఖర్,సభ్యులుపిజి సెల్వం, శివప్రసాద్, డా॥ కృష్ణమూర్తి, అంజి పాల్గొన్నారు.

## కొబ్బరి తెగుళ్లను సకాలంలో నివారించాలి

కుప్పం, అక్టోబర్ 19 ప్రభాతవార్త

కొబ్బరి చెట్లను ఆశించే నల్లముట్టపురుగు తెగుళ్లను రైతులు సకాలంలో నివారించాలని ఉద్యానవన అధికారి డింపుప్రియశ్రీ సూచించారు. శనివారం పిబి నత్తం, మంకలదొడ్డి గ్రామాల్లో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా రైతులకు క్షేత్రస్థాయిలో రూట్ ఫీడింగ్ గురించి వివరించారు. పురుగు ఆశించి ఎండిన ఆకును కాల్చివేయాలన్నారు. మోనోక్రోటోఫాస్ మందు పది మిల్లీలను నీటితో కలిపి చెట్ల వేరుకు ఈ ద్రావణం కలిపి కట్టాలన్నారు. రెండు కిలోల సూపర్ ఫాస్పేట్ , రెండున్నర కిలోల మ్యూరేట్ ఆఫ్‌పొటాఫ్‌వేసినీరుపెడితేచెట్లుత్వరగాకోలుకునికాపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## మద్యం సేవించిన వారి నుండి రూ.52 వేలు జరిమానా

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి నుండి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారి నుండి జరిమానాలు విధించి వసూలు చేసినట్లు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. బంగారుపాళ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపుతూ పట్టుబడిన నలుగురిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఎదుట హాజరు పరిస్తే జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అలాగే మండల పరిధిలో 12 మంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడటంతో ఒకొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురి నుండి రూ.40 వేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 12 మంది నుండి 12 వేల రూపాయలు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు మద్యం సేవించిన వారి నుండి 52 వేల రూపాయల జరిమానా విధించి వసూలు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీముక్కొండ ఆలయంలో ఘనంగా పెరటాసి నెల పూజలు

తవణంపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త:



మండలంలోని వెంగంపల్లె గ్రామ సమీపంలోని ముక్కొండపై వెలసిన శ్రీముక్కొండ శ్రీవేంకటేశ్వర దేవ స్థానం (శ్రీవారి పాదము)లో పెరటాసి నెల ఐదవ శనివారం సందర్భంగా 58వ వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వెంగంపల్లె గ్రామ సమీపంలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీవారిపాదం ఆలయంలో ప్రతిఏటా ఐదవ శనివారం వెంగంపల్లె గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు అర్చకులచే ఆలయంలో స్వామివారికి ఉదయం సుప్రభాతం, స్వామి వారికి అభిషేకాలు, 11 గంటలకు కన్నికలమ మ్కు ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వెంగంపల్లెకు చెందిన చంద్రిక, చంద్రమోహన్‌రెడ్డి దంపతులచే అన్నదానం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు, బాణా సంచా పేలుళ్ళ నడుమ శ్రీసీతారాముల వారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

## మృతురాలి కుటుంబానికి ఎంపీటీసీ ఆర్థికసాయం

తవణంపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ గ్రామపంచాయతీ నల్లప్పరెడ్డిపల్లె దళితవాడ గ్రామంలో అనారోగ్య కారణాలలో మృతిచెందిన జి.వెంకటమ్మ కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ సభ్యుడు జి.కరీం శనివారం ఐదు వేల రూపాయలను ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామస్థుల ఆత్మీయ సమావేశంలో గ్రామంలో ఎవరైనా పేదలు మరణిస్తే అంత్యక్రియలకు ఐదు వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు జి.వెంకటమ్మ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈమొతాన్ని ఎంపీటీసీ కరీం తరపున స్థానిక వైకాపా నాయకుడు పైమాఘం టి.ప్రశాంత్‌కుమార్, సచివాలయ సిబ్బంది ద్వారా మృతురాలి కుటంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు నాగరాజ, గ్రామస్థులు బాలయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దొంగలించబడ్డ సొత్తు లభ్యం

రాజనాలబండ(చౌడేపల్లి), అక్టోబర్ 19 ప్రభాతవార్త



దొంగలించబడ్డ సొత్తు లభ్యం కాగా రాజనాల బండ మహిమగా భక్తులు పూజలు నిర్వహించారు. వారి కథనం మేరకు...అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చెరకువారిపల్లికి చెందిన అజయ్‌బాబు ఇంట్లో చోరీ జరిగింది. తన తల్లి భద్రపరచిన రూ. 5లక్షలు విలువ చేయు 70గ్రాముల బంగారం, రూ. 25వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిం చుకొని వెళ్ళారు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం కనిపించక పోవడంతో బాధితులు రాజనాబండను ఆశ్రయించారు. అనుమానితులను పిలించి ప్రమాణం చేయాలని తలచారు. అయితే స్వామివారి మహి మలు తెలిసుకొన్న గుర్తు తెలియని వ్యకి బంగారాన్ని బాధితుల ఇంటి ముందు పడేశారు. స్వామివారి మహిమగా భావించిన బాధితులు ప్రసన్న ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించి, సొత్తును స్వాధీన పరచుకొన్నారు. ప్రధానార్చకుడు కృష్ణమూర్తి, ఈశ్వర్, టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## సమాజంలో నర్సింగ్ వృత్తి గౌరవప్రదమైంది

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

కుప్పం, అక్టోబర్ 19 ప్రభాతవార్త



సమాజంలో నర్సింగ్ వృత్తి గౌరవప్రదమైందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శనివారం కుప్పం నర్సింగ్ కాలేజ్‌లో లైటింగ్‌డే కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో దీపం వెలిగించే కార్యక్రమం స్ఫూర్తిదాయకమన్నారు. నర్సింగ్ విద్యార్థినులు ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. నర్సులు రోగులకు అన్నీ తానై వ్యవహరించడం గొప్ప విషయమన్నారు. విశిష్ట అతిథి కుప్పం కెసి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డా॥ బాలాజీ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో ప్రతి విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలన్నారు. రోగులకు చిరునవ్వుతో సేవలు అందించే నర్సులు వైద్యుల తర్వాత అంత గొప్పస్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో కెజిసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు



జిల్లా ప్రధాన కార్యదర్శి కామేశ్వర ప్రసాద్

వెంకటగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త

బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ తెలిపారు. వెంకటగిరిలోని శంకర మఠంలో ఆర్థిక మాసంలో నిర్వహించే మహారుద్రాభిషేక బ్రాహ్మణ వన సమారాధనపై సమావేశం నిర్వహించారు. జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న కార్తీక వన సమారాధన మహ రుద్రాభిషేకం శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుండి బ్రాహ్మణులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షు కార్యదర్శుల, కార్యవర్గ సభ్యులకు సమావేశంలో వారితో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కురిచేటి లక్ష్మీనారాయణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి జిల్లెల్లముడి ఆదినారాయణ రావు, కార్యవర్గ సభ్యులు మద్దులపల్లి శ్రీధర్ వర్మ, మహిళా విభాగ అధ్యక్షులు ఇనమనమెల్లూరు జయలక్ష్మి, జిల్లా మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి సురభి ఉమాదేవి, మణికంత, రవికుమార్, ప్రభాకర్, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి అనూష

వెంకటగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త



చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష తెలిపారు. వెంకటగిరిలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆమె న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సును నిర్వహించారు. చట్టాలు తెలుసుకుంటే నేరాలు చేయరని చెప్పారు. బాలికలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఆమె చెప్పారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గురుకుల పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులనుకున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. కోర్ట్ ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించి మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటి వాటిని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 22వ తేది నుండి భూముల రీసర్వే గ్రామ సభలు

తహశీల్దార్ పూజారి శ్రీనివాసులు

బాలాయపల్లి, అక్టోబర్ 19, ప్రభాతవార్త

ఈ నెల 22వ తేది నుండి నవంబర్ నెల 12వ తేది వరకు గ్రామ సచివాలయాల్లో, దేవస్థానాలు, పంచాయితీ కార్యాలయాల్లో భూ రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పూజారి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ఈ సభల ద్వారా రైతులు భూ సమస్యలు ఫిర్యాదులు ద్వారా తెలియపరచవచ్చునని ఆయన తెలిపారు. సర్వేలో అన్యాయం జరిగి ఉంటే వివరాలు తెలియజేయాలని తెలిపారు. మండలంలో నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీఆర్ఓలు, సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్‌లు గ్రామ సభలు నిర్వహిస్తారని ఆయన వివరించారు. గ్రామ సభలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

## ఎన్‌బికెఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్

కోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న టి.వల్లీదేవికి జెఎస్ యూనివర్శిటీ వారు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు డాక్టరేట్ అందుకున్న వల్లీదేవిని ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా వల్లీదేవి మాట్లాడుతూ అధునాతన మిషన్ లెర్నింగ్ టెక్నిక్ ద్వారా కనెక్ట్ చేయబడిన అటానమస్ వెహికల్స్‌లో సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం అనే అంశంపై ప్రొఫెసర్ కె.విజయభాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు జెఎస్ యూనివర్శిటీ వారు తనకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. ఈమెను కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ కోటంరెడ్డి రామకృష్ణారెడ్డిలు అభినందించారు.

## దాడి కేసులో ఆరుగురు అరెస్టు



గూడూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త

గూడూరు రెండవ పట్టణంలో ఇందిరానగర్‌లో ఈనెల 13వ తేది అత్తమామలను దాడి చేసిన సంఘటనలో ఆరు మంది నిందితులను అరెస్టు చేసినట్లు గూడూరు టూ టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరా నగర్‌కు చెందిన మర్రిమాసిన చెంచు కృష్ణయ్య, ధనమ్మతో పాటు కుమారుడు చెంచురామయ్యలను అల్లుడైన గుత్తి సుబ్రమణ్యం మరో ఆరు మందితో కలసిదాడి చేశారని చెప్పారు. ఈ సంఘటన గురించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఎన్టీఆర్ జిల్లాలోని విస్సన్నపేటకు చెందిన గుత్తి సుబ్రమణ్యం, గుత్తి విజయ్, గుత్తి భాస్కర్, గుత్తి సురేష్, గుత్తి రాజేష్, నరసింహ, అనే ఆరు మంది నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా దాడిని చేసినట్లు ఒప్పుకున్నారు. మరో నిందితుడు గుత్తి మనోహర్ పారారీలో ఉన్నాడని వారు తెలిపారు. ఈ క్రమంలో గూడూరు రైల్వే పార్సిల్ విభాగం వద్ద నిందితులు ఉన్నారన్న సమాచారంతో సిఐ శ్రీనివాస్ ఎస్ఐలు బి. గోపాల సుబ్రమణ్యం రాజులు సిబ్బందితో కలిసి ముద్దాయిలను అదుపులో తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, చిరంజీవిలు, నాగేంద్ర, సతీష్, మధు, కృష్ణారావులను డిఎస్పి అభినందించారు.

## గిరిజనులకు నిత్యవసర సరుకులు పంపిణీ

చిల్లకూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త



మండలంలోని లింగవరం గ్రామ పంచాయితీలో ఏర్పాటై ఉన్న జిందాల్ పవర్ ప్లాంట్ యాజమాన్యం శనివారం పంచాయితీలోని కోనుగుంట తీగపాలెం పల్లెవాన దిబ్బలో ఉన్న 60 మంది గిరిజన కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడు తూ సిఎస్ఆర్ యాక్ట్ ద్వారా పంచాయితీ అభివృద్ధితో పాటు పేద ప్రజలకు నిత్యవసర సరుకులు అందించడం సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిహెచ్ఆర్ఓ ఆశిష్ కుమార్, హెచ్ఓపీ కె. శ్రీనివాస్ రావు, కంపెనీ ఉద్యోగులు పేర్కొన్నారు. రేషన్ కిట్లలో నిత్యా వసర వస్తువులు అందించగా గ్రామస్తులు ఆహ్లాదంగా స్వీకరించారు. సమాజానికి తోడ్పాటుగా, సహాయం అవసరమైన వారికి చేయూత అందించడం మా బాధ్యతని సిఎస్ఆర్ విభాగం ప్రతినిధులు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సూళ్లూరుపేట, అక్టోబర్ 19 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీహరి కోట ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, భారతి దంపతుల వివా హ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదా నం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ ఆదిశేషారెడ్డి, క్లబ్ అధ్యక్షులు మధుసూ దన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణారావు, ట్రెజరర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## బిసి వసతిగృహాలు ఆకస్మిక తనిఖీ

కోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త



కోట మండలం చిట్టేడు బిసి బాలుర వసతి గృహాన్ని, కోటలోని బాలుర వసతి గృహాన్ని గూడూరు ఎబిసిడబ్ల్యుఓ వెంకటేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిట్టేడు హాస్టల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరును నిశితంగా పరిశీలించి అక్కడి విద్యార్థులతో మెనూ అందుతున్న తీరుపై విద్యార్థులను అడిగారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారని విద్యార్థులు చెప్పారు. అనంతరం కోట బిసి వసతిగృహాన్ని వెంకటేష్ పరిశీలించారు. ఇక్కడ కూడా రికార్డులు సక్రమంగా ఉండటంతో వార్డెన్ గజేంద్ర పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## గూడలిలో మధ్యాహ్న భోజనం పరిశీలన



కోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త కోట మండలం గూడలి ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎంఇఓ మస్తానయ్య మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఈ సందర్భంగా మస్తానయ్య చెప్పారు.

## కోటలో డ్రైనేజి ప్రారంభం

– హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త



మేజర్ పంచాయతీ కోటలో ఆర్అండ్‌బి రహదారి పక్కనే సైడు డ్రైనేజి పనులను శనివారం ప్రారంభించారు. డ్రైనేజి వ్యవస్థ కోటలో అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్ బాషా చొరవ తీసుకొని డ్రైనేజి పనులు చేయిస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా కోట ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచ్ వెంకటరమణమ్మలు జెసిబి సహాయంతో కాలువ పూడిక తీత పనులు చేయిస్తుండటంతో కోట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర కిలోమీటరు మేరకు ఈ పనులు చేయిస్తామని కార్యదర్శి రాజశేఖర్, సర్పంచ్ వెంకటరమణమ్మ తెలిపారు

## రూ.50 వేలు రాయితీతో ఎస్సీ, ఎస్టీలకు రుణాలు

– ఎపిఎం అనిల

కోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త

ఎస్సీ, ఎస్టీ వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ఉన్నతి పథకం నుంచి రుణాలు అందిస్తోంది. మరోవైపు పొదుపు సంఘాల సభ్యులకు రుణ పరపతిని సైతం పెంచిందని ఎపిఎం అనిల చెప్పారు. ఆమె శనివారం విలేఖరులతో మాట్లాడుతూ రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు వరకు రుణం పెంచిందన్నారు. వ్యక్తిగతంగా రుణాలను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వెలుగు, అంతర్గత, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీ నిధితో పాటు అదనంగా రాయితీ రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు పిండి మిల్లులు, కోళ్ల ఫారాలు, ఐస్ బాక్సులు, సెంట్రింగ్ పనులకు, బ్యూటీ పార్లర్‌లకు వ్యక్తిగత రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు

## తడకండ్రిగలో వేంకటేశ్వరునికి విశేష పూజలు

తడ, అక్టోబర్ 19 ప్రభాతవార్త



తిరవణి నెల సంబరాలలో భాగంగా తడ మండలం తడకండ్రిగలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సుప్రభాతం, మహాభిషేకం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. దేవాలయ కమిటీ, గ్రామపెద్దల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

## జలకళతో రైతుల్లో హర్షం

వాకాడు, అక్టోబర్ 19, ప్రభాతవార్త



ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వాకాడు మండలంలోని భారీ వర్షాలు పడ్డాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలతో పాటు, తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు ఎగువ పడడంతో వాకాడు వద్ద స్వర్ణముఖి నది బ్యారేజ్‌లో భారీగా వరద నీరు చేరుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యారేజ్ సంబంధించిన అధికారులు 9.5 బ్యారేజీలో వరద నీరు నమోదయిందని తెలిపారు. సాగుకు నీరు పుష్కలంగా ఉండటమే కాకుండా, త్రాగునీటి వనరులకు సంబంధించి భూగర్భ జలాలు కూడా పెరగడంతో బ్యారేజీ ఆయకట్టు పరిధిలో ఉన్న దాదాపు పది చెరువులకు బ్యారేజీ నుంచి తూపిలి సరఫరా కాలువ ద్వారా సాగునీరు అధికారులు పంపారు. దీంతో ఆయా గ్రామాల్లో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. అదే విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీర ప్రాంత గ్రామాల్లోని రైతుల సైతం సాగు పనిలో ఉన్నారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు సకాలంలో సూచనలివ్వండి

తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త



రాబోవు రబీ సీజన్‌లో అన్నదాతలకు సరైన సూచనలు సలహాలు ఇచ్చి రైతులకు సాయపడాలని వ్యవసాయశాఖ జిల్లా శిక్షణాధికారి కోఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. ఏపిసీడ్స్‌లోని డివిజన్ స్థాయి రైతు సేవా కేంద్రాల సిబ్బంది శిక్షణలో ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు వరిలో రకాల ఎంపిక నుంచి నారు పెంపకం, నాట్లు ఎరువుల యాజమాన్యం, చీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సలహాలు అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచి రసాయన ఎరువులు, కలుపు మందుల వాడకం తగ్గించాలని తెలిపారు. రసాయనకాలుష్యాల నుంచి భూమాతను కాపాడి భావితరాలకు ఆరోగ్యమైన భూమిని అందించాలని పేర్కొన్నారు. నేడు వర్షాలు సాను కూలంగా పడుతుండడంతో రైతులకు అండగా ఉండి పంట దిగుబడులు పెంచాలని కోరారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు వరిలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్యం గురించి వివరించారు. రబీకాలంలో ఆర్ఎన్ఆర్.15048, కెఎన్యం 733, బిపిటి 2841(బ్లాక్‌రైస్),ఎన్ఎల్ఆర్ 34449 మరియు నెల్లూరు ధన్యరాశి రకాలు సాగుకు అనువైనవిగా తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని నవంబర్ రెండోవారంలో నారు పోసుకుని డిసెంబర్ 15లోపు నాట్లు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు.తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరరెడ్డి వరి, వేరుశనగలో చేపట్టాల్సినసమగ్ర కలుపు నివారణ చర్యలు గురించివివరించారు. యదేచ్ఛగా కలుపు మందుల వాడకంతో నేలలు నిర్జీవమై నిస్సారమవుతాయని ఆయన హెచ్చరించారు. నిపుణుల సలహా మేరకు కలుపు ముందులు వాడాలని ఆయన సూచించారు. ఉద్యానవన అధికారిణి పుష్పలత మాట్లాడుతూ రబీ కాలంలో సాగుచేయాలన్సిన కూరగాయాలు పూలసాగుపై వివరించారు. శిక్షణ ముగింపులో గ్రామ స్థాయి వ్యవసాయ సిబ్బందికి పరీక్షలు నిర్వహించిన ఏరీస్ సంస్థ బహుమతులుఅందించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏడిఏ రమేష్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఏఓ సుధాకర్‌రెడ్డి, తొట్టంబేడు ఏఓ సురేందర్‌రెడ్డి, కెవిబిపురం ఏఓ మురళీ, ఏర్పేడు ఏఓ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో ఈ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు

తిరుపతి,అక్టోబర్ 19ప్రభాతవార్త:

తిరుపతి బాలాజీకాలనీ సబ్‌స్టేషన్‌లో 33/11కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున ఆది వారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని డిఇ వి.చంద్రశేఖరరావు(ఆపరేషన్స్)తెలిపారు. బాలాజీకాలనీ ఎస్ఎస్. రిజర్వాయరుకాలనీ, గిరిపురం ,ఎల్ఐసి రోడ్డు, నెహ్రూనగర్, సింగాలగుంట, ఆర్ఎస్ గార్డెన్, సంజీవయ్యనగర్, మంచాలవీధి, కాలికమ్మగుడి, రామచంద్రకోనేరు ప్రాంతం, మాధవీధి, ఇర్లానగర్, చెన్నారెడ్డికాలనీ, అంబేద్కర్‌కాలనీ, హౌసింగ్‌బోర్డుకాలనీ, అలిపిరి ఎస్ఎస్, వివేకానందసర్కిల్, మారుతీ నగర్, రామ్‌నగర్‌క్వార్టర్స్, స్విమ్స్‌ఆస్పత్రి, రుయా ఆస్పత్రి ప్రాంగణం, ప్రసూతి ఆస్పత్రి, వేదిక్ యూనివర్సిటీ,సైన్స్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

## సపాయికర్మచారీ కమిషన్ ఛైర్మన్‌కు సన్మానం

తిరుపతి,అక్టోబర్ 19ప్రభాతవార్త:



శ్రీవారి దర్శనానంతరం తిరుపతికి వచ్చిన జాతీయ సపారి కర్మచారీస్ కమిషన్ ఛైర్మన్ ఎం.వెంక టేశంకు బిజెపి నేతలు సాదర స్వాగతం పలికారు. స్థానికంగా ఉన్న ప్రాధాన్యత అంశాలు, సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు గుండాల గోపీ నాథరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, మల్లారపు రవిప్ర సాద్,సుబ్రమణ్యంరెడ్డి,రాజశేఖర్‌రెడ్డి,వాసుపుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, దుశ్శాలువతో సత్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

తిరుపతి రూరల్ మండలం 150 బైపాస్ రోడ్డులో వకులమాత గుడి సర్కిల్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామకృష్ణ వివరాల మేరకు ఇలా ఉన్నాయి. ట్రాక్టర్ నందు ఇటుకలు వేసుకుని లోడ్‌తో వెళ్తుండగా వెనుక వైపు నుండి తిరుపతి వైపు వస్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో ట్రాక్టర్ రోడ్డుపై పడిపోయింది. ట్రాక్టర్‌లో ఉన్న వి. రవిశంకర్ రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. దెబ్బలు తగిలిన అతన్ని 108 ఆంబులెన్స్‌లో తిరుపతి రుయా ఆసుపత్రికు తీసుకెళ్లారు. అతని అల్లుడు మిట్టవారిపల్లి గ్రామానికి చెందిన బి. జీవన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ముత్యాల రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కేసులను నిరూపణ చేయుటకు చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు న్యాయం చేయాలి

### కోర్టు కానిస్టేబుళ్లతో జిల్లా ఎస్పి సుబ్బరాయుడు సమీక్ష

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 19, ప్రభాతవార్త



కేసులను నిరూపణ చేయుటకు చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు న్యాయం చేయాలని కోర్టు కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పి సుబ్బరాయుడు సూచించారు. శనివారం కోర్ట్ మానిటరింగ్ సిస్టం అధికార సిబ్బందితో స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లాలోని పెండింగ్ కేసుల స్థితిగతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ కేసు నమోదు చేయడం, ముద్దాయిలను అరెస్టు చేయడం చార్జ్ షీటు వేయడం ఒక ఎత్తు అయితే కోర్టులో విధివిధానాలను సరిగ్గా పాటించి, కేసును నిరూపణ చేయడంలో కీలకమైన బాధ్యత వహించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సర్వే చేయాలన్నారు. ఎన్ఐ యాక్ట్ కేసులపై పాత పెండింగ్ కేసులపై శ్రద్ధ చూపి, వారెంట్లు సర్వే చేయాలన్నారు. సుప్రీం కోర్టు వారి ఆదేశాల మేరకు పాత పెండింగ్ కేసుల విచారణ పూర్తి అయ్యేటట్లు గౌరవ కోర్టు వారికి సూచనల మేరకు పనిచేయాలన్నారు. పోలీసుల అలసత్వం వలన కోర్టులో విచారణ పెండింగ్ లేకుండా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం వారు చర్యలు తీసుకోవాలని కేసు విచారణ సమయంలో సాక్షులు, సాక్షాదారాలు, రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు కోర్టులో పొందుపరచాలన్నారు. దర్యాప్తు అధికారులు కేసు విచారణకు హాజరయ్యేలాగా కోర్టు కానిస్టేబుళ్లు కోర్టు మానిటరింగ్ సిస్టం వారు బాధ్యతాయుతంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిజాయితీగా బాగా పని చేసేవారికి రివార్డులు ఇస్తామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పి సుబ్బరాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకట్రావు పరిపాలన, సిఐలు సుబ్రమణ్యం డిసిఆర్బి, వెంకటప్ప కోర్టు మానిటరింగ్ సిస్టం, కోర్టు లైజన్ ఆఫీసర్లు, జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణ అడ్డుకట్టపై అవగాహన ర్యాలీ

పూతలపట్టు, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పూతలపట్టులో వాక్ ఫర్ ఫ్రీడమ్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా అవార్డ్స్ సంస్థ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నేటికి మానవ అక్రమ రవాణా జరుగుతున్నదని, దీనిని ఆపడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన ర్యాలీలతో మనం అందరం మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకుని అక్రమ రవాణాను అరికట్టడానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 19న వాక్ ఫర్ ఫ్రీడం నినాదంతో ప్రపంచ దేశాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణరావు, రీడ్స్ సంస్థ కో-ఆర్డినేటర్ రాజేంద్ర, అవార్డ్స్ సంస్థ కో-ఫౌండర్ వినోద్‌కుమార్, వైస్ ఛైర్మన్ లావణ్య, సెక్రటరీ చిరంజీవి, పి.వెంకటేష్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వి.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జివి సత్యనారాయణ, ఉపాన్యాసకులు శివకుమార్, గోవిందన్, మమత, శ్యామల, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లమేడులో చోరీ

.తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త

మండలంలోని పిల్లమేడు గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న తన అత్తను తిరుపతిలో ఉంటున్న హరిబాబు తీసుకెళ్ళాడు. దీంతో శనివారం ఇంటికి రావడంతో తాళాలు పగులగొట్టి ఉండడం చూసిన హరిబాబు వెంటనే పోలీసులకు పిర్యాదుచేస్తాడు. దీంతో అక్కడకు చేరుకున్న ఎస్ఐ ఈశ్వరయ్య గుర్తించి కేసునమోదు చేశారు. చోరీలో 16 గ్రాముల బంగారు నగలు, 200గ్రాములు వెండి వస్తువులు చోరీకి గురైనట్లు కేసునమోదు చేశామన్నారు.

## సూక్ష్మ చిన్న మరియు భారీ శాఖ మంత్రికి సత్కారం

..శ్రీకాళహస్తి, అక్టోబర్ 19 ప్రభాతవార్త

సూక్ష్మ చిన్న మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు జితిన్‌రాం మాంజిని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరధాచారి మర్యాద పూర్వకంగా కలసి ఆయన్ను కలంకారి కండువాతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందిం చారు. ఈసందర్భంగా దశరధాచారి మాట్లాడుతూ గత ఐదేళ్ళలో జగన్‌రెడ్డి పాలనలో అస్తవ్యవస్థమైన పరిశ్రమల అభివృద్ది దిశగా నోచుకోలేదని కొన్ని పరిశ్రమలు సబ్సిడీ లేకుండా మూలపడ్డా యని వివరించారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు అనేక సూక్ష్మచిన్నమరియుమధ్యతరహాపరిశ్రమలనుఏర్పాటుచేసిసబ్సిడీలు ఇచ్చి పరిశ్రమలను ఆదుకోవాలన్నారు.



## విద్యుత్‌షాక్‌తో తమిళవాసి మృతి:

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 19 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో బతుకు జీవనం కోసం వచ్చిన ఓ విద్యుత్ కార్మికుడు నిర్లక్ష్యంతో ఆకాల మృత్యువు పాలయ్యాడని అర్బన్ సిఐ గోపి శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన దిలిప్ రాయ్ అనే దిలీప్ తన సహాయకులు ముగ్దరితో ఇక్కడి బిపి అగ్రహారంలో ఓ పని తీసుకొని కాంటాక్టుక పద్దతిలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం పని చేస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు మేయిన్ ఆఫ్ చేసుకోకుండా పని చేయటంతో విద్యుత్‌షాక్‌కు గురైనట్లు వివరించారు.ఆతన్ని వైద్య సదుపాయం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారని సిఐ వివరించారు.మృతదేహాన్ని పోస్టు మార్టం జరిపి బంధువులకు అప్పగించినట్లు సిఐ గోపి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## జూడో జట్టుకు టీ షర్ట్స్ అందించిన శ్యామ్ సుందర్, ఆదినారాయణ రావు, సయ్యద్‌లు

తిరుపతి క్రీడ, అక్టోబర్ 19, ప్రభాతవార్త



అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పలిలిప్స్ కంపెనీ అనెలిటిక్స్ లీడర్ ఆదినారాయణ రావు స్కూల్ గ్రేమ్స్ అండర్ 17 చిత్తూరు జిల్లా జట్టుకు ఇచ్చిన టీషర్ట్స్ ఎన్ఆర్ఐ తుటుకూరి శ్యామ్ సుందర్, డిఎస్‌డిఓ సయ్యద్, కట్టా దొరస్వామి నాయుడు సివిల్ ఇంజనీర్ ప్రేమ్ చెంద్, కమతం రామకృష్ణలు ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడాకారులకు శ్రీనివాస స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో అందజేశారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 20,21న శ్రీకాళహస్తిలో జరుగు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి వెళ్లాలని జిల్లా జూడో సంఘం అధ్యక్షులు నూకతోటి రాజేష్ అన్నారు. జూడో క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఇవ్వటానికి జెన్ అకాడమీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని, జట్టుకు కోచ్‌గా గోపి మంచి శిక్షణ ఇచ్చాడని కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు బాలికలు కె. భవ్య, పి. ఉమా మహేశ్వరి, టి. లలిత, ఎ. ఢిల్లి రాణి, బి. ఉషశ్రీ, హేమ వర్షిణి, మానస, పి. వర్ష, యశ్వంతి, బాలురు బి. ప్రేమ్ కుమార్, వైజె భరత్, భానుప్రకాష్, బి. ఉపేంద్ర, వై.జె అశోక్, ఆర్. మదన్, ఎల్ రామ్ చరణ్, పురుషోత్తం, ఎస్. భైవేష్‌లు ఎంపికైయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సురేష్, సురేష్‌నంద, పిఈటి వాణి, వెంకటమునిలు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్స్‌ను నియంత్రిద్దాం

### విశ్వం టాలెంట్ స్కూల్‌లో ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

తిరుపతి క్రీడ, ఆక్టోబర్ 19, ప్రభాతవార్త



ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్స్‌ను నియంత్రిద్దామని ఆహార భద్రత ప్రమాణాల అధికారులు మద్దిలేటి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి, ఆహార భద్రతాధికారి నర్మాదాలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దిన వారోత్సవాలు తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార భద్రత ప్రమాణాల అధికారులు మద్దిలేటి, నర్మాదాలు మాట్లాడుతూ నేడు విచ్చలవిడిగా విక్రయిస్తున్న పానీపూరి, గోబీ, నూడెల్స్, పిజ్జా, బర్గర్, రెడీమేడ్ చికెన్ ఫ్రై రకాలలో ఆకర్షణీయంగా ఉండడానికి రంగులు రుచికి టేస్టీ సాల్టు నిల్వ ఉండటానికి వాడే రసాయనాలు వల్ల పిల్లలకు ఊబకాయం, జ్ఞాపక శక్తి, కంటి చూపు తగ్గడం, ఛర్మవ్యాధులు ప్రమాదకరమైన లివర్ క్యాన్సర్లు సంభవిస్తున్నాయని నాణ్యతా ప్రమాణాలలేని విక్రయశాలలను బహిష్కరించాలని, ఇలాంటి అనారోగ్యాన్ని కలిగించేవి విక్రయించడం నేరమని, కల్తీ నిరూపతమైతే ఐదు లక్షల రూపాయల వరకు జరిమానాతో పాటు కఠినమైన జైలు శిక్ష ఉంటుందని వ్యాపార సంస్థలు కూడా గుర్తించాలని కోరారు. జిల్లా వినియోగదారుల హక్కులలో ఆహార భద్రత హక్కు, చాలా విశిష్టమైనదని, నాణ్యత లేని ఆహార పదార్ధాలు విక్రయించే వారిని నిలదీసి ప్రశ్నించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం, ఓ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని, పోషక విలువలు లేని జంక్ ఫుడ్స్ కంటే పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, తాజా ఆకుకూరలు, కూరగాయలు పండ్లు తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. అనంతరం విశ్వం టాలెంట్ స్కూల్ డైరెక్టర్ విశ్వం చందన్ మాట్లాడుతూ ఆహార పదార్థాలలో కల్తీలకు పై ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని, ప్రాణాధారమైన సహజ సిద్ధంగా లభించే త్రాగు నీరు కూడా నేడు కోట్లాది రూపాయిలతో విక్రయిస్తూ, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ అని, ప్యాకెట్ వాటర్ అని, ఆల్కాహాల్ వాటర్ లాంటివి డబ్బులు చెల్లించి తీసుకుంటున్నప్పటికి నాణ్యత లేనటువంటి నీరు అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకుని ఇలాంటి వాటి నియంత్రించడానికి అధికారులు కృషి చేయాలని కోరారు.

## శివయ్య సేవలో ఎక్సైజ్ కమిషనర్

శ్రీకాళహస్తి,అక్టోబర్ 19 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహ స్తీశ్వ రాలయంలో ఎపి ఎక్సైజ్ శాఖ కమిషనర్ నితిష కుమార్ రాహుకేతుదోష నివారణ పూజలు జరిపిం చుకున్నారు. శనివారం ఆయన రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ సతీష్‌మాలిక్ వేద పండితులతో స్వాగతం పలికారు.ఆయన రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు.ఆయనకు సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. పూజల అనంతరం వారికి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## ఆధార్‌కార్డుతో దర్శనం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానికులకు దర్శన వివాదాలకు తెరవేస్తూ ఆలయ ఇఒ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ప్రకటించారు. శనివారం ఉదయం కొత్త నిబంధనలతో స్థానికులకు దర్శనానికి నిబంధనలు విధించారు. ఈ మేరకు శనివారం ఉదయం దర్శనానికి వెళ్ళిన మహిళలు సిబ్బందితో వివాద పడ్డారు. దాంతో కొందరుమహిళలు దర్శనం చేసుకోకుండా వెనుదిరిగారు. దాంతో స్పందించిన ఇఒ చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 6గంటల నుంచి 7.30గంటల వరకు సాయంత్రం 7 నుంచి 8.30గంటల వరకు స్థానికులు కంచుగడప వద్ద ఆధార్‌కార్డు చూపి దర్శనానికి వెళ్ళ వచ్చునన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

### -భక్తులకు అన్నదానం

.తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త

తిరువారాల శనివారాల్లో భాగంగా చివరి రోజు కారణంగా మండల కేంద్రంలోని తొట్టందు గ్రామంలోని హరిజనవాడలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆల య భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ఫలపుష్పాలు, మామిడి, అరటితోరణాలతో చక్కగా అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా ఏపి పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ప్రధాన కార్యదర్శి మరి యు ఏపి ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడు చెంచురత్నంయాద్ హాజరయ్యారు. అనంతరం అన్న దానం నిర్వహించారు.సర్పంచ్ సుబ్బయ్యతో పాటు మాజీ సర్పంచ్‌లు సిద్దయ్య, గంగాధరం, తెదేపా నాయకులు భాస్కర్, మణి, రమేష్, రవి, వెంకటేష్, అశోక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజాచైతన్య వేదిక

తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీన సోమవారం తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని ఇందుకు ఎంఎల్ఏ బొజ్జజలవెంకటసుధీర్‌రెడ్డి హాజరవు తున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి మద్నాహ్నం 1గంట వరకు కార్యక్రమం ఉంటుందని మండల ప్రజలుతమసమస్యలపరిష్కారం కోసం వినతిపత్రాలు అందించవచ్చని ఎంపిడిఓ సురేంద్రనాథ్ తెలిపారు.

## చెంబేడు కాలువలో గుర్తు తెలియని మృతదేహం

తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త



చెంబేడు కాలువలో ఓ గుర్తు తెలియని మృతదేహం కొట్టుకుని వచ్చిందని టుటౌన్ సిఐ వెంకటేశులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ మృతుని జేబులో చిన్నప్యాకెట్ డైరీ ఉందని అందులో గురప్ప అని రాసి ఉందన్నారు. ఇతన్ని డైలీ డబ్బులు ప్రకాష్ అను అతనికి కడుతున్నట్లు వ్రాయబడి ఉన్నట్లు ఉందని ఈనెల 17న కంతు కట్టినట్లు ఉందని మృతుడు నలుపు రంగు ఫుల్‌హ్యాండ్ చొక్కా, తెలుపురంగు పూల డిజైన్ కలిగి ఉన్నాడని నలుపు రంగు ప్యాంటుపై తెలుపు రంగు గదులు కలిగిన ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. సాలిపేట విఆర్ఓ సిహెచ్ అనిల్‌కుమార్ సమాచారం అందించాడని ఆయన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే టుటౌన్ సిఐ 9440900008, ఎస్ఐ 9154141887 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

## సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీలు

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

ఒక రోజు జిల్లా పర్యట నిమిత్తం గురువారం చిత్తూరు ఆర్అండ్‌బి అతిథి గృహానికి వచ్చిన సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంత చందోలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌లు ఛైర్మన్‌కు పుష్పగుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సఫాయి కర్మచారి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే టీడీపీకే సాధ్యం

కేవీబీ పురం, అక్టోబరు 19 ప్రభాతవార్త:



మండలంలోని సిద్ధంనాయుడు కండ్రిగ, వగత్తూరు గ్రామ పంచాయతీలలో ఘనంగా పల్లె పండుగ వారోత్సవాలు శనివారం ఎంపీడీవో రాధారాణి నిర్వహించారు. ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశంపార్టీ అధ్య క్షుడు రామాంజులనాయుడు మాట్లాడుతూ ప్రతి పల్లె అభివృద్ధి జరగాలని ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తలపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలు ఘనంగా భూమిపూజ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, జనసేన అధ్యక్షులు థామస్, మెర్వాల గోపి యాదవ్, ఏపీవో కుమారస్వామి, టీఏలు వెంకటయ్య, చెంగల్రాయులు, సచివాలయ సిబ్బంది మణి, ప్రవలిక మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, గోవిందరాజులు, యువ నాయకులు మధునాయుడు, పురుషోత్తం, దొరవేలు, వగత్తూరు బూత్ ఇన్‌చార్జి వెంకటేష్, నాధముని, రంగయ్య, మునస్వామి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

విజయపురం,అక్టోబరు 19 ప్రభాతవార్త:



గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ రాజు పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భా గంగా శనివారం మండలంలోని జంబాడ పంచాయతీ పరిధిలో చిన్న జంబాడ, కోసలనగరం పంచాయతీ పరిధిలో కేశవపురం ఎస్టీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మా ణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సౌకర్యవంతంగా సీసీ రోడ్లు, మురికి కాలువలు సమస్యల పరిష్కారానికి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహి స్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ రవిరాజు, టీడీపీ యువ నాయకుడు కొండూరు దామోధర్‌రాజు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బూచివానత్తంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విజయపురం, అక్టోబరు 19 ప్రభాతవార్త:



మండలంలోని బూచివానత్తం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ పర్య వేక్షణలో శనివారం పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జేసీబీ సహాయంతో వీధులకు ఇరువైపులా ముళ్ళ చెట్లను, చెత్తాచదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లారు.

## సర్వజీవుల సేవయే సర్వేంద్రుని సేవ

పుత్తూరురూరల్, అక్టోబరు 19 ప్రభాతవార్త:



రీసెర్చ్ స్కాలర్ తెలుగు విభాగం వారు విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశం లో గరికపాటి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వృద్ధాప్యం అంటే వృధా కాకుండా ఆప్యాయతలను పంచేది అన్నారు. సేవా పరమార్థం అనే అంశంపై మాట్లాడుతూ విశ్రాంత జీవితంలో కూడా అవిశ్రాంతంగా సంఘ సేవలు చేస్తున్న పుత్తూరు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశలు, బంధాలు తగ్గించుకుంటూ ఒంటరిగా ఉండక మంచి ఆలోచనలతో ఇష్టమైన పనిలో నిమగ్నమైతే వృద్ధాప్యం గుర్తుకు రాధన్నారు. నారాయణరావు మోటివేషనల్ వక్తపై సమావేశానికి విశిష్ట అతిథిగా పాల్గొని జీవించడం ఒక కళ అనే అంశంపై వివరించారు. సమావేశానికి బసవరాజు భాస్కర్‌రాజు అధ్యక్షత వహించారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి మునిరాజులశెట్టి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రూ.50 వేలు విరాళం ఇచ్చారు. శ్రీమతి శెట్టి, శ్రీ మనోహర్‌నాయుడు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు భోజన వితరణ చేశారు. ఈ సమావేశంలో సాహిత్య పిపాసి ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, గౌరవాధ్యక్షులు గుణశేఖర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు కృపావరమ్మ, యుగంధర్‌రాజు, సంఘం సభ్యులు, కుప్పయ్య, రామలింగం, రామమూర్తి, చంద్రశేఖర్ వర్మ, వెంకటకృష్ణమనాయుడు, చిరంజీవి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన సాంకేతికతతో టొయోటా కిర్లోస్కర్ మోటర్

తిరుపతి విద్య, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

పండుగ స్ఫూర్తిని మరింత పెంచుతూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్ శనివారం టొయోటా గ్లాంజా యొక్క ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ని పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. కస్టమర్లు ఇప్పుడు ప్రత్యేకమైన డీలర్-ఫిట్టెడ్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ(టిజిఎ)ప్యాకేజీలను ఆస్వాదించవచ్చునని, ఈ పండుగ కాలంలో గ్లాన్జా యొక్క మెరుగైన శైలి,పనితీరు,సౌలభ్యంతో వారి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించబడింది.టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెడిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ ఈ పండుగ సీజన్ లో మా కస్టమర్లకు మరింత ఉత్సాహాన్ని అందించడమే మా లక్ష్యం అని అన్నారు.టొయోటా గ్లాంజా యొక్క ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయంతో గ్లాన్జా దాని డైనమిక్-స్పోర్టీ డిజైన్,అధునాతన ఫీచర్లు,అత్యుత్తమ పనితీరు కోసం ఎల్లప్పుడూ ప్రశంసించబడింది అని తెలిపారు.

## ఎస్వీయూలో చెట్లు నాటే కార్యక్రమం

తిరుపతి విద్య, అక్టోబర్ 19 ప్రభాతవార్త:

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రతి మూడవ శనివారం జరిగే వర్సిటీ కార్యక్రమం క్లీన్ అండ్ గ్రీన్ భాగంగా వర్సిటీలో వివిధ ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ బ్యూరో, ఇంజనీరింగ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చెట్ల నాటే కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు యస్వీయూలోని వామనరావు భవనం ముందట చెట్లను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను తట్టుకొని నిలబడాలన్న,జీవజాతికి మేలు పెంచాల్సిన సమయం చెట్లను అదే స్థాయిలో మనం పెంచాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిని విద్యార్థులు, సమాజంలో ఉన్న పౌరులు బాధ్యతగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు వర్సిటీలో వివిధ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి,ఆచార్య సుధారాణి,డీన్ ఆచార్య చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఆచార్య దామోదరం డాక్టర్ హరికృష్ణ,కల్చరల్ కోఆర్డినేటర్ డా పత్తిపాటి వివేక్,ఇంజనీర్ తాండవ కృష్ణ,అధ్యాపకులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 2011 తరువాత విరమణ పొందిన ఉద్యోగులు వివరాలు సమర్పించాలి

### - బాలసుబ్రహ్మణ్యం

నగరి, అక్టోబరు 19 ప్రభాతవార్త:

2011 సంవత్సరం నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరూ తమ వివరాలను వెంటనే రిటైర్డ్ ఉద్యోగ సంఘ కార్యాలయంలో సమర్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నగరి యూనిట్ కార్యదర్శి ఓ.బాలసుబ్రహ్మణ్యం శనివారం ఒకప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ అనంతరం తాము తీసుకున్న కమ్యూటేషన్ మొత్తాన్ని 15 సంవత్సరాల వరకు నెలనెలా మినహాయిస్తున్నారని, అయితే హర్యానా రాష్ట్రంలో ఉద్యోగులు ప్రభుత్వంపై హై కోర్టుకు వెళ్లి తమకు కేవలం 12 సంవత్సరాల వరకు మాత్రమే నెలనెలా మినహాయించాలని కేసు వేయగా కోర్టు ఉద్యోగులకు తీర్పు వెలువరించిందన్నారు. అదే పంథాలో తెలంగాణ ప్రభుత్వం కూడా తీర్పు ఇచ్చిందని, మన రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు కూడా కోర్టుకు వెళ్లేందుకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీ విజయవాడలో రాష్ట్ర కార్యవర్గం సమావేశమై ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తుందన్నారు. కావున 2011 నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరూ తమ పూర్తి వివరాలను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నగరి యూనిట్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ అంశంపై చర్చించడానికి ఈ నెల 27వ తేదీ నగరి యూనిట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలన్నారు.

## ప్రణాళికాబద్ధంగా బోధన ఉండాలి



నగరి, అక్టోబరు 19 ప్రభాతవార్త:

ప్రణాళికాబద్ధంగా బోధన ఉండాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని వేలావడి ఉర్దూ పాఠశాలను ఆమె తనిఖీ చేసి ఉపాధ్యాయులతో స మీక్ష సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్స రంలో చేపట్టవలసిన కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలన్నారు. ఆ మేరకు రికార్డులు నిర్వ హించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు.